## క్లుప్తంగా

### రికార్డు స్థాయిలో బొగ్గు ఉత్పత్తి



జీఎంను సన్మానిస్తున్న కనకరాజు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి వార్షిక ఉత్పత్తిలో కొత్తగూడెం సరికొత్త రికార్డు సృష్టించిందని కార్మిక నేత ఆకునూరి కనకరాజు అన్నారు. ఈ మేరకు మంగళవారం కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజును సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సింగరేణి మొత్తం 69 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిలో కొత్తగూడెం ఏరియా మొదటి స్థానాన్ని కైవసం చేసుకుందన్నారు.

### ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుంది

ఇల్లెందు: అనారోగ్యం బారిన పడిన పేదలకు వైద్యం అందించి వారి ఆరోగ్యం కాపాడేందుకు ప్రభుత్వం భరోసాగా నిలుస్తుందని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మంగళవారం జేకే ఎమ్మెల్యే కార్యాలయంలో ఏర్పాటు చేసిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీలో ఆయన లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా 108 మంది లబ్ధిదారులకు రూ.34.05 లక్షలు చెక్కులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బానోతు రాంబాబు, దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, యదళ్లపల్లి అనసూర్య, మండల రాము తదితరులు పాల్గొన్నారు.

### క్రికెట్ పోటీలు ప్రారంభం

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం పట్టణ పరిధిలోని మున్సిపల్ ప్రగతి మైదానంలో ప్రీమియర్ క్రికెట్ లీగ్ పోటీలను మంగళవారం సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా ప్రారంభించారు. మాట్లాడుతూ.. క్రీడా పోటీలను నిర్వహిస్తున్న నిర్వాహకులను, క్రీడాకారులను అభినందించారు. యువత, విద్యార్థులు అధునిక పోకడలకు పోకుండా క్రీడలు, సాంస్కృతిక రంగాల వైపు ఆసక్తి కనబరచాలన్నారు. ఈ కార్యక్రమంలో కంచర్ల జమలయ్య, కత్తెర రవీందర్ పాల్గొన్నారు.

### ప్లాస్టిక్ కవర్లు సీజ్

ఇల్లెందు: పట్టణంలోని పలు కిరాణా జనరల్ దుకాణాలను మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ తన సిబ్బందితో మంగళవారం ఆంబజార్‌లోని షాపులను తనిఖీ చేశారు. పెద్ద ఎత్తున ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు అమ్ముతున్న షాపులను పరిశీలించారు. 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం గల బ్యాగులను మాత్రమే విక్రయించాలని, నిషేధిత ప్లాస్టిక్, డిస్పోజబుల్ ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ప్లాస్టిక్ వస్తువులు అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### బూడిద అక్రమ తరలింపును నిలిపివేయాలి



మాట్లాడుతున్న నరేష్

పాల్వంచ: బూడిద అక్రమ తరలింపును వెంటనే నిలిపివేయాలని, దీనిపై ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్, ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్లకు, నేషనల్ ఎస్టీ కమిషనర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు భట్టు నరేష్, ధర్మసోత్ చందర్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గడిచిన ఐదు నెలల్లో ఎటువంటి అర్హత లేని కాంట్రాక్టర్లకు అనుమతి ఇచ్చారని, ఐటీడీఏ పీఓ ఎంపిక చేసిన 39 మంది అర్హులైన వారికి ఇంకా అనుమతులు ఇవ్వకపోవడం పలు అనుమానాలు తావిస్తోందన్నారు. ఆర్డర్ లేకుండా తరలించే ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేదంటే యాష్ తరలింపును అడ్డుకుంటామన్నారు. కార్యక్రమంలో భట్టు అశోక్, భట్టు కృష్ణ, బోడా భీమ పాల్గొన్నారు.

### రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి

జూలూరుపాడు: మొక్కజొన్న కంకులు తిని మృతి చెందిన జర్పల కృష్ణ రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ రాజేష్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వినోభానగర్ గ్రామానికి చెందిన రైతు జర్పల కృష్ణ ఇటీవల మొక్కజొన్న కంకులు తిని చనిపోవడంతో ఆ రైతు కుటుంబాన్ని మంగళవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓ కంపెనీకి చెందిన ఆడ, మొక్కజొన్న విత్తనాలను రైతు కృష్ణ సాగు చేసినట్లు చెప్పారు. రైతు పంటకు కాపాలా కాస్తున్న సమయంలో కంకులు తినడంతో తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందాడన్నారు. విత్తన కంపెనీ బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, బాధిత రైతు కుటుంబానికి రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇప్పించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ధర్మసోత్ దశరథ్ నాయక్, గుగులోత్ కుశాల్ నాయక్, గుగులోత్ నరేష్, భూక్యా సామ్యా తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ రోడ్ల నిర్మాణానికి ముగిసిన గడువు

- మండలంలో రూ.2.50 కోట్ల వ్యయంతో 50 సీసీ రోడ్లు మంజూరు
- సగం రోడ్లు మాత్రమే నిర్మాణం
- అందులోనూ నాణ్యతకు తిలోదకాలు



సత్యనారాయణపురంలో సీసీ రోడ్డు నిర్మాణం

పాల్వంచరూరల్: గ్రామీణ ప్రాంత రహదార్లకు మహర్దశ పట్టింది. ఉపాధి హామీ నిధులతో గ్రామ పంచాయతీల్లో సీసీ రోడ్ల నిర్మాణం చేస్తున్నారు. అయితే ప్రస్తుతం మంజూరైన సగం రోడ్లు మాత్రమే నిర్మాణం చేయగా మరో సగం రోడ్ల నిర్మాణం జరగలేదు. గడువు పొడిగిస్తేనే అవి పూర్తిచేసే అవకాశం ఉంటుంది. లేదంటే ఇక ఆ రోడ్లకు గ్రహణం పట్టినట్లే. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మండలంలోని 36 గ్రామ పంచాయతీల పరిధిలో రూ.2.50 కోట్ల వ్యయంతో 50 సీసీ రోడ్లు, డ్రెయినేజీలు మంజూరు కాగా వీటి నిర్మాణం మార్చి 31నాటికి పూర్తిచేయాలని గడువు నిర్దేశించారు. అయితే గడువులోగా పూర్తిచేయకపోతే నిధులు వెనక్కిపోతాయి. ప్రతీ సంవత్సరం ఉపాధి హామీ పథకం కింద మంజూరైన రహదార్ల నిర్మాణం పనులు ఆర్థిక సంవత్సరం ముగింపు నెలలోనే ప్రారంభించడంతో నిర్దేశించిన గడువులోగా పూర్తిచేయాలనే తొందర కారణంగా పనుల్లో నాణ్యత లోపిస్తోంది. మండలంలో 50 రోడ్లకు రూ.2.50 కోట్లు మంజూరు కాగా మార్చి31లోగా 25 రోడ్ల నిర్మాణం మాత్రమే పూర్తయింది. జగన్నాథపురం, సోములగూడెం, నాగారంకాలనీ, నాగారం, పాండురంగాపురం గ్రామాల్లో రోడ్ల పనులు ప్రారంభమే కాలేదు.

**నాసిరకంగా పనులు...** నిర్దేశించిన గడువులోగా రహదార్ల నిర్మాణం పనులు పూర్తి చేసేందుకు తొందర కారణంగా నాణ్యతా లోపంతో నిర్మించారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. సంగం గ్రామం నుంచి సంగగట్టు గ్రామం వరకు రూ.40లక్షల వ్యయంతో నిర్మాణం చేసిన రహదారి అస్తవ్యస్తంగా ఉంది. నాసిరకం ఇసుకతో పనులు చేపట్టి, వాటర్ క్యూరింగ్ చేయలేదని స్థానికులు అంటున్నారు. ప్రతీ సంవత్సరం ఇలా మార్చిలో హడావుడి చేయడం పనులు నాసిరకంగా చేయడం పరిపాటిగా మారింది.

### గడువు పెంచాలి...



ప్రతీ సంవత్సరం ఉపాధి హామీ పథకం కింద మంజూరైన రోడ్ల నిర్మాణ పనులకు చివరి నెల గడువు నిర్దేశించడంతో ఆ పనులు పూర్తి చేయాలంటే సమయం లేక పనివాళ్లు సకాలంలో దొరకక పనులు పూర్తి చేయలేక కాంట్రాక్టర్లు ప్రతీ సంవత్సరం నష్టపోతున్నారు. ప్రభుత్వం గడువును పొడిగించి పనులు పూర్తి చేసేవిధంగా చర్యలు తీసుకోవాలి.
– రవి, సారెకల్లు

### నాసిరకంగా ఉంటున్నాయి..



ప్రతీ ఏడాది మంజూరు చేసే సీసీ రోడ్ల నిర్మాణ పనులకు గడువును నిర్దేశించడంతో పనుల్లో నాణ్యతా లోపాలు ఉంటున్నాయి. అధికారులు పనుల గడువును నిర్దేశించకుండా సమయం ఇస్తే పనుల్లో నాణ్యంగా ఉంటాయి. ఇప్పటికైనా అధికారులు గడువును పెంచేవిధంగా చర్యలు తీసుకోవాలి. గ్రామాల అభివృద్ధికి సహకరించాలి.
– హనుమంతరావు, పాండురంగాపురం

### మళ్లీ అనుమతులు తీసుకోవాలి..



ఉపాధి పథకం కింద జిల్లాలో మంజూరైన రోడ్లు, డ్రెయినేజీల పనులను మార్చి 31లోగా పూర్తి చేయాలని గడువు నిర్దేశించారు. పనులు ప్రారంభించని రోడ్లకు మళ్లీ అనుమతులు తీసుకున్న తర్వాతే నిర్మాణం చేయాలి. గడువులోగా పూర్తి కాని పనులను మళ్లీ ప్రారంభించుకునే అవకాశం ఉంది. గడువులోగా పూర్తి చేయకుంటే బిల్లులు రావు.
– శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ ఈఈ

# నష్టపరిహారం చెల్లించండి..



కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న ఎమ్మెల్యే

టేకులపల్లి: హైకోర్టు తీర్పు అమలు చేసి కోయగూడెం ఓసీ 2 ఫేజ్ 2, 3 భూ నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలని భూ నిర్వాసితుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం లచ్చగూడెంలో కలెక్టర్‌ను కలిసి నిర్వాసితుల సమస్యను వివరించారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య కూడా కలెక్టర్‌కు లేఖ రాశారని తెలిపారు. సింగరేణి యాజమాన్యం నిర్లక్ష్యం వల్ల గిరిజన నిర్వాసితులు అన్యాయానికి గురవుతున్నారని, హైకోర్టు తీర్పు ఇచ్చినా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దొడ్డ సంపత్ కుమార, దొడ్డ కోటేశ్వరరావు, చీమల కృష్ణ, దొడ్డ లక్ష్మయ్య, దనసరి భారతమ్మ, కొర్స లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# దెబ్బతిన్న పంటలను కొనుగోలు చేయాలి

ఇల్లెందురూరల్: అకాల వర్షం, గాలి దుమారంతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ మాస్‌లైన్ నాయకులు మంగళవారం క్షేత్ర పర్యటన చేపట్టారు. పలు గ్రామాలలో నేలవాలిన మొక్కజొన్న, వరి పంటలను, కల్లాల్లో తడిసిన మక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాస్‌లైన్ నాయకులు నాయిని రాజు, శ్రీరాంకోటయ్య మాట్లాడుతూ.. నాలుగు రోజుల క్రితం కురిసిన భారీ వర్షంతో చాలా చోట్ల పంటలు దెబ్బతిన్నాయని, వాటిని రక్షించే పనిలో ఉండగానే సోమవారం రాత్రి వీచిన గాలిదుమారం, వడగండ్ల వాన రైతులను కోలుకోకుండా చేసిందని వాపోయారు. క్షేత్ర పర్యటనకు వస్తున్న అధికారులు వాస్తవాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతులను ఆదుకునేలా సూచన చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అజ్మీర బిచ్చా, జూకంటి గాంధీ, బుర్ర రాఘవులు, వాంకుడోత్ శంకర్, ముత్తమ్మ, ఇస్లావత్ కోటేష్, బుర్ర లక్ష్మయ్య, ధరావత్ దేవా, సమ్మయ్య, పాషా, సత్యం తదతరులు పాల్గొన్నారు.

**తడిసిన పంటలను కొనుగోలు చేయాలి..** అకాల వర్షానికి తడిసిన పంటలను ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేయాలని న్యూడెమోక్రసీ నాయకులు బానోత్ సంతు, వాంకుడోత్ మోతీలాల్ డిమాండ్ చేశారు. గాలిదుమారం, భారీ వర్షానికి పంటలకు జరిగిన నష్టాన్ని మంగళవారం వారు పరిశీలించారు. మాట్లాడుతూ.. భారీ వర్షం, గాలి దుమారం కారణంగా అన్ని రకాల పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. కార్యక్రమంలో మూడు మాలు, జోగ కృష్ణ, నర్సయ్య, భద్రయ్య, కాంపాటి శ్రీను, లక్ష్మయ్య, సమ్మయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



మాట్లాడుతున్న పరంధామరెడ్డి

పాల్వంచరూరల్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై ఆసక్తిని పెంచుకోవాలని జిల్లా యువజన క్రీడా అధికారి ఎం.పరంధామరెడ్డి అన్నారు. లక్ష్మీదేవిపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ (అటానమస్) కళాశాలలో మంగళవారం కళాశాల వార్షికోత్సవం, క్రీడా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. పరంధామరెడ్డి మాట్లాడుతూ... కళాశాల విద్యార్థులు యూనివర్సిటీ, రాష్ట్రస్థాయి క్రీడల్లో కళాశాలకు పేరు తేవాలన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కళాశాల క్రీడాకారులకు రూ.1.30 లక్షల క్రీడా సామగ్రిని అందజేసినట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ పద్మను అధ్యాపకులు, పూర్వవిద్యార్థులు శాలువ, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ యుగేందర్‌రెడ్డి, డాక్టర్ నర్సింహకుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జె.మాధవి, డాక్టర్ టి.అరుణకుమారి, కొండలరావు, విజయప్రసాద్, రమేష్, స్వరూపరాణి, వేముల కామేశ్వరరావు, రాజేష్, శివ కమలాకర్, వేణు పాల్గొన్నారు.

**గురుకుల కళాశాలలో...** లక్ష్మీదేవిపల్లిలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో మంగళవారం క్రీడా దినోత్సవం, కళాశాల వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం మండల విద్యాధికారి శ్రీరామ్మూర్తి, కళాశాల మాజీ ప్రిన్సిపాళ్లు, దమ్మపేట గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, పీవీఎస్ పాపారావులను ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ అన్వేష్, ఉపాధ్యాయులు, పూలమాలలు, శాలువలతో సత్కరించారు.

### నేడు విద్యుత్ సరఫరా బంద్

జూలూరుపాడు: పాపకొల్లు (అన్నారుపాడు) విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు జూలూరుపాడు విద్యుత్‌శాఖ ఏఈ సతీష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి 11 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

### ప్రభుత్వ పథకాలపై ఇంటింటి సర్వే



సుభాష్‌నగర్‌లో సర్వే చేస్తున్న నాయకులు

ఇల్లెందు: సీపీఎం ఆధ్వర్యంలో ప్రభుత్వం ప్రకటించిన పథకాల అమలు తీరుపై ఇంటింటి సర్వే చేపట్టారు. మంగళవారం పట్టణంలో మండలంలో పలు ప్రాంతాల్లో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఆరు గ్యారంటీలు అమలు తీరును ప్రధానంగా ప్రజల నుంచి సమాచారం సేకరిస్తున్నట్లు ఆ పార్టీ మండల కార్యదర్శి ఆలేటి కిరణ్ తెలిపారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు సక్రమంగా అమలు చేయటం లేదని, అర్హులందరికీ అందటం లేదన్నారు.

### సమాఖ్య కోశాధికారి మృతిపై సంతాపం

ఇల్లెందురూరల్: ముత్తారపుకట్ట గ్రామానికి చెందిన మండల మహిళా సమాఖ్య కోశాధికారి కుంజ సుగుణ (35) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. ఆమె భౌతికకాయంపై మండల మహిళా సమాఖ్య ప్రతినిధులు, సెర్ప్ ఏపీఎం దుర్గారావు, సిబ్బంది పూలమాల వేసి నివాళులర్పించారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు ఊకే నాగమణి, కార్యదర్శి సౌజన్య, కొమ్మాలు, నర్సింహారావు, నందకుమారి తదితరులు నివాళులర్పించారు.

# ఆటో డ్రైవర్లను ఆదుకోండి..



ఆర్టీఓకు వినతిపత్రం అందజేస్తున్న ఆటో డ్రైవర్లు

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెం నియోజకవర్గంలో రాపిడ్, ఓలా, ఉబర్ ప్రైవేట్ సంస్థలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆటో వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో మంగళవారం పోస్టాఫీస్ సెంటర్ నుంచి ఆర్టీఓ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కంచర్ల జమలయ్య మాట్లాడుతూ.. నాలుగు కిలోమీటర్ల వైశాల్యం కలిగిన కొత్తగూడెం పట్టణానికి ప్రైవేట్ సంస్థలు అవసరం లేదన్నారు. వీటివల్ల ఆటోడ్రైవర్లు తీవ్రంగా నష్ట పోతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. మహాలక్ష్మి పథకం కారణంగా ఇప్పటికే జీవనోపాధి కోల్పోతున్న ఆటోడ్రైవర్లకు గుదిబండలా ప్రైవేట్ సంస్థలకు అనుమతి ఇవ్వాలనుకోవడం సరైంది కాదన్నారు. ప్రభుత్వం ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్టీఓ మధుకు వినతిపత్రం అందజేశారు. మర్రి కృష్ణ, అబ్బులు, అమీద్, లక్ష్మణ్, భాషా, భాస్కర్, కోటి, రామరాజు, కోటేశ్వరరావు, జోసఫ్ పాల్గొన్నారు.

# మతోన్మాద విధానాలను అరికట్టాలి



ధర్నా చేస్తున్న ఎన్డీ నాయకులు, కార్యకర్తలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఆర్ఎస్ఎస్, బీజేపీ ఫాసిస్ట్, మతోన్మాద విధానాలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకుడు కె.రంగారెడ్డి, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, జిల్లా కార్యదర్శి ముద్దా భిక్షం మాట్లాడారు. కార్మిక హక్కుల కోసం ట్రేడ్ యూనియన్లు, గిట్టుబాటు ధరకు చట్టం చేయాలని, రుణాలను రద్దు చేయాలని రైతులు పోరాడుతుంటే... ఆర్ఎస్ఎస్, బీజేపీ, భజరంగదళ్ 1773లో మరణించిన ఔరంగజేబు సమాధి గొడవను రేకెత్తించి అమాయక హిందువులను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. మహారాష్ట్ర ప్రజల సమస్యలైన రైతుల ఆత్మహత్యలు, ఆర్థిక ఇబ్బందులు, ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, ఆహార పదార్థాల తరుగుదల తదితర వాటి నుంచి ప్రజల దృష్టి మరల్చడానికి సమాధిని కూల్చివేయాలనే నినాదాన్ని ఇచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చ లేకుండా కొత్త విద్యావిధానం 2020ని ప్రవేశపెట్టిందని విమర్శించారు. హిందుత్వ ఫాసిస్ట్ శక్తుల అణచివేత ధోరణి, దోపిడీకి గురవుతున్న అన్నివర్గాల ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అనంతరం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. చంద్ర అరుణ, కె.కల్పన, జాటోత్ కృష్ణ, ప్రభాకర్ పాల్గొన్నారు.

# స్థానికంగానే పోస్టింగ్ ఇవ్వాలి

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ప్రాంత అప్రెంటిస్ అభ్యర్థులకు సత్తుపల్లిలో కాకుండా కొత్తగూడెంలోనే పారదర్శకంగా పోస్టింగ్‌లు కల్పించాలని ఎంవీటీసీ మేనేజర్ లక్ష్మణ్‌ను ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ కోరారు. మంగళవారం కొత్తగూడెం ఏరియా ఎంవీటీసీ కార్యాయంలో పలువురు అభ్యర్థులతో ఆయన మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. మాట్లాడుతూ... కొత్తగూడెం ఏరియాలో అత్యధికంగా బొగ్గు ఉత్పత్తి జరుగుతున్నప్పటికీ అప్రెంటిస్‌షిప్‌కు ఎంపిక అయిన అభ్యర్థులను సత్తుపల్లికి పంపించటం సరైందికాదని, వారికి ఇచ్చే రూ.8 వేల స్టైఫండ్ వారి రవాణా ఖర్చులకు సరిపోదని, కొత్తగూడెం ప్రాంతం వారికి కొత్తగూడెంలోనే పోస్టింగ్ కల్పించాలని కోరారు. అదే విధంగా కల్లూరు, తల్లాడ ప్రాంతాల వారికి సత్తుపల్లిలో పోస్టింగ్ ఇవ్వాలని సూచించారు.

# డిజిటల్ కమ్యూనికేషన్‌పై సదస్సు



మాట్లాడుతున్న హరికృష్ణ

సూపర్‌బజార్(కొత్తగూడెం): సింగరేణి మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో మంగళవారం ఫిజిక్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగం ఆధ్వర్యంలో డిజిటల్ కమ్యూనికేషన్‌పై సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా కేఎస్ఎం డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఈ.హరికృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఎలక్ట్రానిక్ పరికరాల నిర్మాణం, వాటి పనితీరుపై వివరించారు. ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్ ఎలా తయారు చేయాలో తెలిపారు. డిజిటల్ కమ్యూనికేషన్ గురించి మాట్లాడుతూ... ప్రస్తుత నిత్యావసరాలలో మానవాళికి ఎలక్ట్రానిక్ పరికరాల పనితీరు, వినియోగం ప్రయోజనాలను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శారద మాట్లాడుతూ... ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో ఎలక్ట్రానిక్ పరికరాల వినియోగం లేనిదే మనిషి మనుగడ అసాధ్యంగా మారిందన్నారు. విద్యార్థినులు ఎలక్ట్రానిక్ విభాగాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని చెప్పారు.

# విద్యార్థుల యూనిఫామ్ క్లాత్ పంపిణీ



కొత్తగూడెంఅర్బన్: యూనిఫామ్ క్లాత్‌తో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు

కొత్తగూడెంఅర్బన్: 2025–26 విద్యా సంవత్సరానికి గానూ ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న యూనిఫామ్ క్లాత్ మంగళవారం కొత్తగూడెం మండలానికి చేరుకుందని ఎంఈఓ ప్రభుదయాళ్ తెలిపారు. మంగళవారం వచ్చిన క్లాత్‌ను వివిధ పాఠశాలల హెచ్‌ఎంలకు అందజేసి పలు సూచనలు చేశారు. పాఠశాలల వారీగా యూనిఫాం క్లాత్‌ను ముందుగానే ఎంపిక చేసిన స్వయం సహాయక బృందాల దర్జీలకు ప్రతీ విద్యార్థి కొలత ప్రకారం ప్రభుత్వం సూచించిన మేర కుట్టించాలని కోరారు.

జూలూరుపాడు: వచ్చే విద్యా సంవత్సరం పాఠశాలల పునఃప్రారంభం రోజే విద్యార్థులకు యూనిఫామ్ అందజేస్తామని జూలూరుపాడు ఎంఈఓ బానోత్ జుంకీలాల్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫామ్ క్లాత్‌ను మంగళవారం స్థానిక మండల వనరుల కేంద్రానికి చేరాయి. ఈ సందర్భంగా క్లాత్‌ను ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, సెర్ప్ సిబ్బందికి ఎంఈఓ అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు.

# గ్యాస్ ధర పెంపుతో పేదలపై భారం



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): కేంద్ర ప్రభుత్వం పెంచిన వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని పీడీఎస్‌యూ, టీయూసీఐ ఆధ్వర్యంలో మంగళవారం కొత్తగూడెంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. చంద్ర అరుణ, కే.కల్పన మాట్లాడుతూ.. నరేంద్ర మోదీ ప్రభుత్వం మరోసారి దేశ ప్రజలపై పెనుభారం మోపిందన్నారు. పేద ప్రజలను అన్నివిధాల ఆదుకుంటామని చెబుతున్న కేంద్ర ప్రభుత్వం వంటగ్యాస్ ధరలు పెంచడం గర్హనీయం అన్నారు. ఇప్పటికైనా పెంచిన పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. వై.సావిత్రి, కొడెం దుర్గ, మునిగెల మహేశ్వరి, ముత్తమ్మ, పెద్దబోయిన సతీష్, జాటోత్ కృష్ణ, సుందర్ పాల్గొన్నారు.

పాల్వంచ: కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ముత్యాల విశ్వనాథం డిమాండ్ చేశారు. సోమవారం సాయంత్రం ఒడ్డుగూడెంలో సీపీఐ శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వనాథం మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టే విధంగా వ్యవహరిస్తోందన్నారు. కార్యక్రమంలో బండి నాగేశ్వరరావు, ఉప్పుశెట్టి రాహుల్, మడుపు ఉపేంద్రాచారి, వైఎస్ గిరి, గోపాలరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# శిథిలావస్థలో పశువైద్యశాల



సింగరేణి క్వార్టర్‌లో పశువైద్యశాల



కోతికి సెలైన్ ఎక్కిస్తున్న సిబ్బంది

సూపర్‌బజార్(కొత్తగూడెం): కార్మిక ప్రాంతమైన రామవరంలోని పశువైద్యశాల సొంత భవనంతోపాటు కనీస సౌకర్యాలు లేక సతమతమవుతోంది. కొత్తగూడెం మున్సిపాలిటీ వార్డులతోపాటు సమీప ప్రాంతాలలోని గ్రామాల పశువులకు ఈ ఆస్పత్రే పెద్దదిక్కు. దీనిని ఉమ్మడి రాష్ట్రంలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 2000 సంవత్సరంలో అసంపూర్తి దశలోనే డిసెంబర్‌లో ప్రారంభించారు. అప్పటి నుంచి ఆవులు, గేదెలు, కుక్కలు, పిల్లులు, కోళ్లు, బాతులు తదితర మూగజీవాలకు వైద్యం అందిస్తున్నారు. అసంపూర్తి భవనాన్ని ఇప్పటికీ పూర్తి చేయకపోవడంతో పక్కనే ఉన్న సింగరేణి క్వార్టర్‌లో ఆస్పత్రిని నడుపుతున్నారు. ఇది కూడా ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. వర్షం వస్తే పైకప్పు కురుస్తుంది. గదుల్లో వర్షం నీరు చేరుతుంది. దీంతో వైద్యసిబ్బంది, ఆస్పత్రికి వచ్చేవారు ఇబ్బంది పడుతున్నారు. ఈ ఆస్పత్రిలో ఆధ్వర్యంలో పశువైద్య శిబిరాలను నిర్వహిస్తూ పశువులకు నట్టలమందు, వ్యాక్సినేషన్‌లను వేస్తూ వైద్యం అందిస్తున్నారు. సమస్యలపై స్పందించి ఇప్పటికైనా అధికారులు అసంపూర్తి భవనానికి మరమ్మతులు నిర్వహించం లేదా నూతన భవనాన్ని నిర్మించి ఆస్పత్రికి వచ్చే పశువుల అవసరానికి అనుగుణంగా పరికరాలు, మందులు సమకూర్చాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

### నూతన భవనం నిర్మించాలి..



వైద్యం కోసం వచ్చే మూగజీవాల సంఖ్యకు అనుగుణంగా పశువైద్యశాల భవనం నిర్మించాలి. అన్నిరకాల పరికరాలు, మందులను సమకూర్చాలి. ఉన్న దాంట్లో మెరుగైన వైద్యం అందిస్తున్నారు.
– ఎండీ హఫీజ్, రామవరం

### ప్రమాదకరంగా ఉంది..



పశువుల ఆస్పత్రికి అన్ని సౌకర్యాలతో పక్కా భవనం నిర్మించాలి. చుట్టు పక్కల గ్రామాల నుంచి కూడా పశువులను వైద్యానికి తీసుకొస్తారు. శిథిలమైన భవనంలో ఆస్పత్రి నిర్వహణ ప్రమాదకరం.
– అంబాల సుజాత, పంజాబుగడ్డ

### సౌకర్యాలు కల్పించాలి..



పక్కా భవనాన్ని నిర్మించి అన్ని సౌకర్యాలు కల్పిస్తే మరింత మెరుగైన వైద్యం అందించగలుగుతాం. అరకొర సౌకర్యాల సమస్యను గుర్తించి ప్రజల కోరిక మేరకు పశువైద్యశాలను నిర్మించాలి.
– డాక్టర్ ఆనందరావు, పశువైద్యాధికారి, రామవరం